
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కర్నూలు
జిల్లా వార్తలు
5
సోమవారం 29 సెప్టెంబరు 2025

ఆర్డీఎస్ ఆనకట్టకు జలకళ



కోసిగి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలంలోని అగసనూరు సమీపంలోని తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీఎస్ ఆనకట్టకు జలకళ సంతరించుకుంది. మూడు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు ఆర్డీఎస్‌కు భారీగా వరద పోటెత్తడంతో జలకళ సంతరించుకుంది. పశ్చిమ ప్రాంతంతో పాటు ఎగువన ఉన్న కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు సుమారు 1.20 లక్షల క్యూసెక్కుల నీరు ఆర్డీఎస్‌కు పోటెత్తడంతో ఆర్డీఎస్ ఆనకట్టపై వరద నీరు ఉధృతంగా దిగువకు ప్రవహిస్తోంది. దీంతో తుంగభద్ర నదీతీర గ్రామాల రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వేణుగోపాల్, సీఐ మంజునాథ్, ఆయా నదీతీర గ్రామాల ప్రజలకు తెలియజేశారు. చేపలవేటకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని, చేపలవేటకు వెళ్లవద్దని సూచించారు. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద వీఆర్ఏలను, కానిస్టేబుళ్లను బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ, పోలీసు అధికారులు తెలిపారు.

హంద్రీకి జీడీపీ నీరు

- నాలుగో గేటు ద్వారా 500 క్యూసెక్కులు విడుదల



గోనెగండ్ల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి ఇరిగేషన్ అధికారులు హంద్రీనదికి 4వ గేటు ద్వారా 500 క్యూసెక్కుల నీటిని హంద్రీనదికి విడుదల చేసినట్లు ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. శుక్రవారం, శనివారం కురిసిన వర్షాల కారణంగా ఆదివారం తెల్లవారుజాము వరకు 18,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అయితే ఆదివారం ఉదయం నుంచి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో తగ్గడంతో 500 క్యూసెక్కులకు పరిమితం చేశారు. ఆదివారం సాయంత్రం నుంచి ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలలైన మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, ఆస్పరి, దేవనకొండ తదితర ప్రాంతాలలో ఒక మోస్తరు వర్షం కురియడంతో నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం జీడీపీలో నీటి మట్టం పూర్తి స్థాయిలో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఆదివారం సాయంత్రానికి నీటి మట్టం 376.88 మీటర్లు ఉంది. జీడీపీ పూర్తిస్థాయి నీటి మట్టం 377 మీటర్లు అయితే ప్రస్తుతం కేవలం 0.12 మీటర్ల మాత్రమే తక్కువ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులో నీరు సామర్థ్యానికి తగ్గట్టుగా పూర్తిగా ఉందని, ఇప్పటి నుంచి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటని ఎప్పటి కప్పుడు దిగువకు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

దేవరగట్టుకు చేరుకున్న పల్లకి

హొళగుంద, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి బన్నీ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా స్వామివారి ప ల్లకి దేవరగట్టుకు చేరుకుంది. ఆలయ పూజారులు గిరి మల్లయ్య, మహేష్, మనోహర్ ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేరణికి గ్రామం మల్లేశ్వర స్వామి దేవాలయంలోని మాళమ్మా, మల్లేశ్వర స్వామి పల్లకికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామాల్లో పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లి దేవరగట్టుపై ఉన్న గిరికి పల్లకి చేరుకోగానే కర్రల సమరానికి గ్రామాల ప్రజలు సిద్ధమవుతారు. అక్టోబరు 2వ తేదీన దసరా పండుగ రోజు కీలకమైన బన్నీ ఉత్సవం ఉంటుందని ఆలయ పూజారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కురువ సోము, బోయ మల్లికార్జున, వీరనగప్ప, గోపాల్, కంచ వీర మహేష్ కుమార్, గోరవయ్యలు మెలిగిరి, గిరి, వెంకటేష్, చంద్ర పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ ఏ.సిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని విని యోగించుకోవాలని సూచించారు. అధికారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నెంబర్. 1100కు ఫోన్ చేయాలన్నారు.

ఆర్‌యూ పీజీ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో పీజీ రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ డా.ఎస్.వెంకటేశ్వర్లు విడుదల చేవారు. 462 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 413 మంది ఉత్తీర్ణత సాదించారని తెలిపారు.



ఆనంద్ థియేటర్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న హంద్రీ



దేవనగర్‌కు వెళ్లే రహదారిపై ప్రవహిస్తున్న వరద

ఉధృతంగా హంద్రీ ప్రవాహం



- కల్లూరు బ్రిడ్జిపై పోటెత్తిన వరద
- నదీతీర కాలనీల్లో చేరిన నీరు

కర్నూలు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): హంద్రీనదికి వరద పోటెత్తింది. ఆదివారం కల్లూరు వంతెనపై నది ప్రమాదకర స్థాయిలో ప్రవహించింది. నగరంలోని కల్లూరు, విఠల్ నగర్, కృష్ణానగర్, దేవానగర్ తదితర కాలనీల ప్రజలు వరద ప్రవాహంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నది బఫర్ జోన్ ఆక్రమించి నిర్మించుకున్న ఇళ్లలోకి వరద చేరింది. పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాల్లో కురిసిన వర్షాలకు వంకలు, వాగులు పొంగిపొర్లాయి. భారీ ఎత్తున వరద హంద్రీదికి చేరింది. గాజులదిన్నె జలాశయం గరిష్ఠ సామర్థ్యం 4.50 టీఎంసీలు కాగా, 4.05 టీఎంసీలు నిల్వ చేసి వచ్చిన వరదను వచ్చినట్లుగా దిగువకు వదిలేస్తున్నారు. అలాగే కృష్ణగిరి మండలంలో కురిసిన వర్షాలకు పాలహంద్రీ నుంచి కూడా పెద్ద ఎత్తున వరద వచ్చి చేరుతోంది. కర్నూలు నగరంలో ఆదివారం ఉదయం 8 గంటలకు 30.500 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంటే సాయంత్రం 5 గంటలకు 27 వేల క్యూసెక్కులకు తగ్గిపోయింది. జోహరాపురం సమీపంలో తుంగభద్రలో కలుస్తోంది. వానలు తగ్గడంతో వరద ఉధృతి తగ్గింది. లేకుంటే నదీతీర ప్రాంతాలన్నీ నీట మునిగి భారీ నష్టం వచ్చే ప్రమాదం ఉందని ఇంజనీర్లు ఆందోళన వ్యక్తం చేశారు. వరద ముప్పు నుంచి గట్టెక్కాలంటే హంద్రీ ఇరువైపున ఉన్న ఆక్రమణలను అధికారులు తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వేలం ఎప్పుడో?

- జూన్ 30కే ముగిసిన చేపల పెంపకం గడువు
- నేటికీ కొనసాగుతున్న చేపల వేట
- కోట్లలో ఆదాయం.. లక్షల్లో వేలం..
- నిర్లక్ష్యంలో అధికారులు



రిజర్వాయర్‌లో చేపల వేటకు సిద్ధంగా ఉన్న బోట్లు

పత్తికొండ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పందికోన రిజర్వాయర్‌లో చేపల పెంపకం కోసం వేలం ఎప్పుడో నిర్వహిస్తారో తెలియని పరిస్థితి. జూన్ 30వ తేదీకే గడువు ముగి సింది. మూడు నెలలు కావస్తున్నా మత్స్యశాఖ అధికారులు రిజర్వాయర్‌లో ఈఏడాది చేపల పెంపకం వేలంపాటలు నిర్వహించలేదు. గడవు ముగిసినా కొందరు మత్స్యకారులు చేపల వేటను కొనసాగిస్తున్నారు. వేరే ప్రాంతాలకు యథేచ్ఛగా రవాణా చేస్తూ ప్రభుత్వ నిబంధనలను నీరుగారుస్తున్నారు. చర్యలు చేపట్టాల్సిన మత్స్యశాఖ అధికారులు ఆవైపు కన్నెత్తి కూడా చూడటంలేదన్న విమర్శలున్నాయి.

1.02 టీఎంసీల నీటి సామర్థ్యంతో..

సుమారు 1200ఎకరాల విస్తీర్ణంలో 1.02టీఎంసీల నీటి సామర్థ్యంతో పందికోన రిజర్వాయర్‌ను నిర్మించారు. పత్తికొండ, దేవనకొండ, కోడుమూరు మండలాల పరిధిలో సుమారు 32వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో నిర్మాణం ప్రారంబించారు. ఆతర్వాత 68వేల ఎకరాలకు సాగునీరందించేలా కుడి, ఎడమ కాలువల సామర్థ్యాన్ని పెంచారు. పెండింగ్‌లో బండ్, రివిట్‌మెంట్ పనులు రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి ప్రధానంగా బండ్, రివిట్‌మెంట్ పనులు పెండింగ్ లో ఉన్నాయి. దీంతో 1.02టీఎంసీల నీటిసామర్థ్యం ఉన్న ఈరిజర్వాయర్‌లో 0.5 టీఎంసీ నీటిని నిలువ చేసేందుకే అవకాశం మిగిలింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కర్నూలుకు చెందిన ఓవ్యక్తి ఈరిజర్వాయర్‌లో చేపల పెంపకం అనధికారికంగా నిర్వహిం చాడు. ఆతర్వాత రిజర్వాయర్‌లో చేపలపెంపకం బాధ్యతలను మత్స్యశాఖ తీసుకుంది. సమీపగ్రామాల పంచాయతీలతో కలసి రిజర్వాయర్ లో చేపల పెంపకంకు వేలం పాటలు నిర్వహించి అనుమతులివ్వడం ప్రారంభించింది.

మత్స్యకారులకు కోట్లలో ..

చేపలపెంపకం ద్వారా మత్స్యకారులకు



చేపలను ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉన్న బాక్స్‌లు

కోట్లలో ఆదాయం సమకూరుతోంది. మత్స్యశాఖ అధికారులు తూతూమంత్రంగా వేలంపాటలు నిర్వహిస్తూ తక్కువ ధరలకు చేపల పెంపకం అనుమతులిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. 2023లో రూ.3,13,211, అలాగే 2024లో రూ.3,49,0 00కు పలికింది. లక్షల్లో ఆదాయం మాత్రమే ఉన్న జొన్నగిరి చెరువులో చేపలపెంపకం రూ.11లక్షలు దాటగా రూ కోట్లలో ఆదా యం ఉన్న పందికోన రిజర్వాయర్‌లో చేపలపెంపకం వేలంపాటల ఆదాయం ఎం దుకు పెరగడంలేదో అర్థకాని ప్రశ్నగానే మిగిలింది. ఈఏడాదైనా అధికారులు నిర క్ష్యం వీడి ప్రభుత్వ ఆదాయంపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

హెచ్చరికలు జారీచేశాం

పందికోన రిజర్వాయర్‌లో చేపలపెంపకానికి వేలంపాటల కోసం ఇప్పటికే ఉన్నతాధికారుల అనుమతుల కోసం నివేదికలు పంపాం. వారి ఆదేశాలు అందిన వెంటనే వేలం పాటలు నిర్వహిస్తాం. గడవు ముగిశాక చేపలవేట చేయరాదని ఇప్పటికే అక్కడ నివసిస్తున్న జాలర్లకు హెచ్చరికలు జారీ చేశాం.

● నాగరాజు, ఇన్‌చార్జి డీఈ, మత్స్యశాఖ



గ్రామోత్సవంలో అధికారులు

కాళరాత్రి అలంకరణలో భ్రామరి

- శ్రీగిరిపై ఆది దంపతులకు గజ వాహనసేవ



శ్రీశైలం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో దసరా ఉత్సవాలు సందడిగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడోరోజు ఆదివారం భ్రమరాంబికా దేవి భక్తులకు కాళరాత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా అమ్మవారిని అక్కమహాదేవి అలంకార మండపంలో విశేష పుష్పాలతో అలంకరణ చేశారు. ఈ దేవి నల్లటి దేహఛాయతో జుట్టు విరబోసుకుని రౌద్రరూపంలో కనిపించారు. ఈ అలంకరనలో అమ్మవారు నాలుగు చేతులను కలిగి ఉంటారు. కుడివైపున అభయహస్తం, వరద ముద్రను, ఎడమవైపు ఖడ్గము, లోహకంటకాన్ని ధరించారు. కాళరాత్రి స్వరూపం చూడటానికి రౌద్రంగా ఉన్నప్పటికీ ఈమె ఎల్లప్పుడూ శుభ ఫలితాలను ఇస్తారు. అందుకే ఈమెను శుభంకరి అని కూడా పిలుస్తారు.

గజవాహనంపై ఆది దంపతులు

వాహనసేవలో భాగంగా సాయంత్రం భ్రమరాంబికాదేవి, మల్లికార్జున స్వామివారు ప్రత్యేక అలంకరణలో గజవాహనంపై విహరించారు. అక్కమహదేవి అలంకార మండపం నుంచి ఆలయ రాజగోపురం మీదుగా గంగాధర మండపం, నందిగుడి క్షేత్ర ప్రాంతాల్లో గ్రామోత్సవం కొనసాగింది. గ్రామోత్సవంలో ఆలయ ఈఓ ఎం.శ్రీనివాసరావు, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

నేడు మహాగౌరి అలంకరణ

దసరా ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం నాడు అమ్మవారు మహాగౌరి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. రాత్రికి ఆది దంపతులు నందివాహనంపై విహరిస్తారు.

శ్రీశైలం జలాశయానికి భారీగా వరద

- ఇన్‌ఫ్లో 5,20,552, అవుట్ ఫ్లో 5,18,650 క్యూసెక్కులు
- సాగర్‌కు 10 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల



శ్రీశైలం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎగువ జూరాల గేట్ల నుంచి శ్రీశైలం డ్యామ్‌కు 5,20,552 క్యూసెక్కులు వచ్చి చేరింది. శ్రీశైలం రిజర్వాయర్ ఒక్క స్పిల్ వే ద్వారా దిగువ సాగర్‌కు 5,18,650 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భారీగా వరద డ్యాంను చేరుతుండడంతో ఇంజనీర్లు ఎప్పటికప్పుడు వరద ఉధృతిని సాగనంపుతున్నారు. శ్రీశైలం డ్యాం 10 క్రస్ట్‌గేట్లను 23 అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. సుంకేసుల 79,268 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 27వేల క్యూసెక్కుల నీరు చేరుతోంది. అలాగే శ్రీశైలం కుడిగట్టు విద్యుదుత్పత్తి అనంతరం 29,444 క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రం ఉత్పత్తి అనంతరం 35,315 క్యూసెక్కులు విడుదల చేశారు. డ్యాం నీటిమట్టం ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి 882 అడుగులుగా ఉండగా.. నీటి నిల్వ సామర్థ్యం 202 టీఎంసీలుగా ఉంది.

బీఎడ్ అడ్జస్ట్ చేయలేక..

- స్థానిక విద్యార్థులకు కఠినతర నిబంధనలు
- ఇతర రాష్ట్రాల అడ్మిషన్ల కోసం ఒప్పందాలు
- రంగంలోకి ఏజెంట్లు
- వత్తాసు పలుకుతున్న వర్సిటీ ఉన్నతాధికారులు



బీఎడ్‌లో స్థానిక విద్యార్థులను చేర్చుకునేందుకు కళాశాలల యాజమాన్యాలు ఆసక్తి చూపడంలేదు. వారిని అడ్జస్ట్ చేయలేక కఠినతర నిబంధనలు పెడుతున్నాయి. రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ)కి అనుబంధంగా దాదాపు 49 బీఎడ్ కళాశాలలున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డీఎస్సీ నిర్వహించింది. దీంతో బీఈడీ కళాశాలలు ఒక్కసారిగా ఫీజులు పెంచేశారు. యూనివర్సిటీ ఉన్నతాధికారులు బీఈడీ కళాశాలల అక్రమాలను చూసీచూడనట్లు వ్యవహరిస్తూ వారికి వత్తాసు పలుకుతున్నారు.

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎడ్‌సెట్- 2025 కౌన్సెలింగ్ ప్రారంభం కాక ముందే ఆయా కళాశాలలు బీహార్, ఒరిస్సా, నాగాలాండ్, త్రిపుర, మీజోరం రాష్ట్రాలకు చెందిన విద్యార్థులను చేర్చుకొని అడ్మిషన్లు పూర్తిచేశాయి. ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ ద్వారా బీఎడ్ కళాశాలలకు ఆలాట్ అయిన విద్యార్థులు కళా శాలలు కఠినతర షరతులు పెట్టి వెనక్కి పంపుతున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.



రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

స్థానిక బీఎడ్ విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. యూనివర్సిటీ ఉన్నతాధికారులు బీఈడీ కళాశాలల అక్రమాలను చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ వారి వత్తాసు పలుకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరో మూడు రోజుల్లో జరిగే మరో దశ కౌన్సెలింగ్‌లోనైనా విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

లక్షల్లో ప్యాకేజీలు మాట్లాడుకొని..

వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులను జిల్లాలోని బీఈడీ కళాశాలల్లో చేర్పించేందుకు ఏజెం ట్లు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. లక్షల్లో ప్యాకేజీలు మాట్లాడుకొని స్థానిక యాజమాన్యాలతో ఒప్పందం కుదుర్చుకుంటున్నారని, వీరికి వర్సిటీలోని కొందరు అధికారులు సహకరిస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈతంతు దశాబ్ద కాలంగా సాగుతున్న విషయం తెలిసిందే. మరోమారు ఈదందాలకు ఏజెంట్లు తెగబడ్డారని విద్యార్థి సంఘాల నాయకులు అంటున్నారు.

ఆయా కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

బీఎడ్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్ స్టూడెంట్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు సురేష్ యాదవ్ అన్నారు. రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ విజయకుమార్ నాయు డుకు ఇటీవలే వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక విద్యార్థులకు కఠినమైన షరతులు పెట్టి వెనక్కి పంపుతున్నారు.

సమస్యలు తన దృష్టికి..

విద్యార్థులకు ఏమైనా అలాంటి సమస్యలుంటే తన దృష్టికి తేవాలి. బీఈడీ కళాశాలల్లో విద్యార్థుల చేరికలపై ఎవరూ ఫిర్యాదు చేయలేదు. విద్యార్థులు సమస్యను తన దృష్టికి తీసుకొస్తే న్యాయం చేస్తా.

● బోయ విజయకుమార్ నాయుడు, రిజిస్ట్రార్, ఆర్‌యూ

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి

● పీఈటీలకు సూచించిన ఎంపీ బస్తిపాటి నాగరాజు



ఎంపీని కలిసిన పీఈటీలు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు సూచించారు. ఆదివారం నగరంలోని కార్యాలయంలో పర్ల జడ్పీ పాఠశాల క్రీడల సెక్రటరీగా ఎంపికైన టి. క్రిష్ణను అభినందించారు. కె. వెంకటేశ్వర్లు, బి.శేఖర్, ఎం.శేఖర్, కిరణ్‌బాబు, సురేష్ గౌడ్, మురళి కృష్ణ పాల్గొన్నారు.

ప్రజారోగ్య భద్రతకు ప్రభుత్వం చర్యలు



మాట్లాడుతున్న గౌరు జనార్దన్ రెడ్డి

కల్లూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని టీడీపీ యువ నాయకుడు గౌరు జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ మెడికల్ కాళాశాలలపై వైసీపీ సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు ప్రచారాలను తీవ్రంగా ఖండించారు. మాజీ సీఎం జగన్‌కు పీపీపీ అంటే తెలికపవడం దౌర్భాగ్యమన్నారు. రెండేళ్లలోనే మెడికల్ కాలేజీలు పూర్తవుతాయని, ప్రభుత్వంపై ఆర్థిక భారం పడకుండా సీఎం చంద్రబాబు చేస్తున్న మంచి పనిని ప్రశంసించాలన్నారు. పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, పియా మాదన్న, ఎస్‌కే. శ్రీనివాసరావు, బి.నాగిరెడ్డి, నాగముని పాల్గొన్నారు.

పెట్రోల్ పంపును సరిగా నిర్వహించాలి



రికార్డులు పరిశీలిస్తున్న మేనేజర్ చిన్నరాముడు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పాతబస్టాండు సమీపంలోని నగర పాలక సంస్థ నిర్వహిస్తున్న పెట్రోల్ పంపును సరిగా నిర్వహించాలని మేనేజర్ చిన్నరాముడు ఆదేశించారు. ఆదివారం పెట్రోల్ బంకును తనిఖీ చేసి, రికార్డులు, హజరు పరిశీలించారు. కార్పొరేషన్‌కు ఆదాయం సమకూర్చాలని నిర్లక్ష్యం, పొరపాట్లకు తావు ఇవ్వవద్దని సూచించారు. ఎల్లప్పుడు ఇంధనం అందుబాటులో ఉంచి, సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆదేశించారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



కార్డులు పంపిణీ చేస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): హుశేనాపురం గ్రామంలో ఆదివారం నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ప్రజాపంపిణీని పారదర్శకంగా అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్డులో ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్దిదారు ఫొటో, చౌక దుకాణం సంఖ్య తో పాటు చిప్ అమర్చారన్నారు. చంద్రపెద్దస్వామి, బజారు, మహబూబ్ బాషా, కేవీ మధు, డీలర్ హైమావతి, వీఆర్వో మౌలిబాషా పాల్గొన్నారు.

● నన్నూరులో తహసీల్దార్ విద్యాసాగర్, టీడీపీ నాయకుడు విశ్వేశ్వరరెడ్డి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధిక విజయుడు, కృష్ణారెడ్డి, ఖాజామియా పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

కోడుమూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. అక్షిత ట్రస్ట్ సహకారంతో తలసేమియా చిన్నారుల కోసం రక్తదానం చేసినట్లు జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి తెలిపారు. క్రిష్ణ, శేషకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కవిత్వోద్యమ లావా జాషువా



మాట్లాడుతున్న అష్టావధాని గంగుల నాగరాజు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆధునిక తెలుగు సాహిత్య కవిత్వోద్యమ లావాలా నవయుగ కవి చక్రవర్తి, కవి కోకిల గుర్రం జాషువా నిలిచిపోయారని అష్టావధాని గంగుల నాగరాజు అన్నారు. ఆదివారం నగరంలో మద్దూర్‌నగర్ పింగళి సూరన తెలుగుతోటలో గుర్రం జాషువా 130వ జయంతి నిర్వహించారు. తెలుగు కళాస్రవంతి అధ్యక్షుడు ఎస్ఎండీ ఇనాయ తుల్లా అధ్యక్షత సభ ఏర్పాటుచేశారు. జాషువా దళిత, అణగారిన వర్గాల పక్షాన కవిత్వ రచన చేశారని గుర్తు చేశారు. గిజిగాడు, శిశువు, గబ్బిలం, ఫిరదౌసి కావ్యాలు రచించి రచించి చిరస్మరణీయులయ్యారని కొనియాడారు. గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు కేసీ కల్కూర మాట్లాడుతూ జాషువా ఆనాటి కులవ్యవస్థ వివక్షతకు వ్యతిరేకంగా ఉద్యమించారన్నారు. తెలుగు భాషా వికాసం జేఎస్ఆర్‌కే శర్మ, మహమ్మద్ మియా పాల్గొన్నారు.

ఏడో రోజు విశేష అలంకరణ

● కర్నూలులో కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు



పసుపుతో అలంకరణ

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగర ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఏడో రోజు ఆదివారం విశేష అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పూలబజార్ సమీపంలోగల చిన్న అమ్మవారిశాలలో వాసవి మాత విగ్రహానికి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు, హోమాలు చేశారు. సాయంత్రం వారాహిదేవి అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. గీతామందిరంలో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవికి ద్వాదశ ఆదిత్యులు అలంకరణ చేశారు. జమ్మిచెట్టు వీధిలోని లలితా పీఠంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. నగర శివారు గోదాగోకులంలో అమ్మవారికి మహాలక్ష్మిదేవి అలంకరణ చేశారు. అలాగే గూడూరు మండలం కే.నాగులాపురంలోని ఆలయంలో సుంకులా పరమేశ్వరి అమ్మవారికి పూజలు పంపిణీ చేశారు.



లలితా పీఠంలో రథోత్సవం



సత్యసాయి మందిరంలో అలంకరణ





దేవనగర్ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారు, మహిళ నృత్యాలు

పీఆర్సీని ప్రకటించాలి



మాట్లాడుతున్న నాగరాజు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పీఆర్సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించి 30 శాతం ఐఆర్‌ను విడుదల చేయాలని

● తెలుగునాడు వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు

ఏపీ తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎన్‌టీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) జిల్లా ఉపాధ్యక్షుడు కే.మక్బూల్ సాహేబ్ తెలుగునాడు వైద్య ఉద్యోగుల సంఘంలో చేరారు.

ఈ సందర్భంగా సంఘం నాగరాజు మాట్లాడుతూ జీవో.నెం. 143ను, ఏఎన్ఎం రీడిప్లాయిమెంట్‌ను రద్దు చేయాలన్నారు. జీఎన్ఎం శిక్షణ పొందిన ఏఎన్ఎంలకు సీనియారిటీ ప్రాతిపదికన స్టాఫ్ నర్సులుగా పదోన్నతులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ.మాధవరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కే.మద్దయ్య, ఉపాధ్యక్షుడు నాగరాజు, ఈసీ మెంబర్ రంగడు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50వేలు ఇవ్వాలి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కేకే భవన్‌లో మాట్లాడుతూ అతివృష్టి, అనావృష్టితో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ ఏడాది అధిక వర్షాలతో పంటలు దెబ్బతిని, దిగుబడి పడిపోయిందన్నారు. రైతులను ఆదుకుంటామని చెబుతున్నారని పదే పదే చెబుతున్న సీఎం చంద్రబాబు ఇంత ఎరరకు క్షేత్రస్థాయిలో పరిశీలించలేదన్నారు. కె.వెంకటేశులు, జి.రామక్రిష్ణ, కోటకొండ సూర్తి, ఏ.కృష్ణ, హనుమంతు, రంగారెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నాలుగు పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని పీఆర్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎన్వీ కృష్ణారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కరుణానిధిమూర్తి మాట్లాడుతూ పీఆర్సీ అమలు ఆలస్యం కావడంతో 30 శాతం ఐఆర్ పకటించి పీఆర్సీ అమలుకు కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు రవిప్రకాష్, రమణయ్య, బాబు రావు, వీరారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బుగ్గన, కొండారెడ్డి, నాగేశ్వరయ్య, శ్రీనివాసరెడ్డి, శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్వీ కృష్ణారెడ్డి

తెలుగు సాహితీ దిగ్గజం జాషువా

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గుర్రం జాషువా తెలుగు సాహితీ దిగ్గజమని మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గుర్రం జాషువా 130వ జయంతి నిర్వహించారు. ఎన్నో పురస్కారాలు అందుకుని, తెలుగు భాషకు చేసిన సేవలు అమోఘమని కొనియాడారు. ఎస్సీ బజారన్న, షేక్ ఖాజాహుస్సేన్, ఎన్‌చంద్రశేఖర్, కేశవరెడ్డి పాల్గొన్నారు.

కర్నూలు కళాకారులకు ప్రశంసలు



నాటకంలోని ఒక దృశ్యం

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తెనాలిలో కళల కాణాచి కళా సంస్థ నిర్వహించిన జాతీయ స్థాయి పౌరాణిక పద్య నాటక పోటీల్లో కర్నూలు టీజీవీ కల్చరల్ అకాడమీ కళాకారులకు ప్రశంసలు లభించాయి. సినీ మాటల రచయిత బుర్రా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో, డాక్టర్ ఏఆర్ కృష్ణ, డాక్టర్ జీవీఎన్ వరప్రసాద్ నిర్వహణలో ఈ నాటక పోటీలు ఈనెల 30 వరకు కొనసాగనున్నాయి. వీవీ రమణారెడ్డి దర్శకత్వంలో, శారదా ప్రసన్న రాసిన 'శ్రీ వేంకేశ్వర మహత్యం' శనివారం ప్రదర్శించారు. ప్రోత్సహిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌కు దర్శకుడు వీవీ రమణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

సగర ఉప్పరలు రాణించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సగర ఉప్పరలు విద్య, ఉద్యోగ రాజకీయ రంగాల్లో రాణించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి పేర్కొన్నారు. ఆదివారం బి.క్యాంపు సమీపంలోని బీసీ భవన్‌లో సమవేశం నిర్వహించారు. అసెంబ్లీలో సగర ఉప్పర్లకు అవకాశం కల్పించాలన్నారు. అనంతరం కన్వీనర్‌గా కొంగనపాడు ఉప్పరి శివన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉప్పర సురేష్, తాడిశెట్టి నాగేశ్వరరావు, ఎల్వీ ప్రసాద్, రామగిడ్డయ్య, రాజేష్ పాల్గొన్నారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. ప్రజలు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని కోరారు. ఫిర్యాదు వివరాలు https://meekosam.ap.gov.in నందు చూడవచ్చని పేర్కొన్నారు.

జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో డిసెంబరు 31 నుంచి 4 జనవరి 2026 వరకు నిర్వహించనున్న సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. ఆదివారం కేకే భవన్‌లో నగర రైస్‌మిల్ హమాలీ కార్మికుల సమావేశం నిర్వహించారు. గాలెన్న అధ్యక్షతన వహించారు. సంఘటిత, అసంఘటిత రగ ఉద్యోగ, కార్మికుల సమస్యలపై చర్చిస్తామన్నారు. ఆర్.నరసింహులు, సీహెచ్. సాయిబాబ పాల్గొన్నారు.

7న ధర్నా

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 7న విజయవాడలో చేయనున్న ధర్నాను జయప్రరదం చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నరహరి, రమణయ్య విజ్ఞప్తి చేశారు. ఆదివారం మాట్లాడుతూ ధర్నా చౌక్ వద్ద ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. వేతన సవరణ ముగిసి రెండు సంవత్సరాలు పూర్తయినా, పీఆర్సీ, డీఏలను చెల్లించలేదన్నారు.

పనులు వేగవంతం చేయాలి



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన రహదారుల వెంట చేస్తున్న సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. ఆదివారం బుధవారపేట, కలెక్టరేట్, గాయత్రి ఎస్టేట్‌లో చేస్తున్న పనులను పరిశీలించారు. నాణ్యతలో రాజీ పడకూడదని నగరాన్ని తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.డీఈఈ గిరిరాజ్, టీపీవో అంజాద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో నాసిరకంగా రోడ్లు వేసిన, కాంట్రాక్టర్, ఇంజనీర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ ప్రతినిధులు నెహ్రూ రోడ్డును పరిశీలించారు. నాలుగు నెలల క్రితం వేసి సీసీ రోడ్డు చిన్నపాటి వర్షానికే గుంతలు పడిందన్నారు. నాణ్యత పరిశీలించకుండానే అధికారులు కళ్లు మూసుకుని బిల్లు మంజూరు చేశారన్నారు.

వంతెన కింద నీరు ఉండకుండా చూడాలి



వంతెన వద్ద నీటిని పరిశీలిస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బిర్లా వద్ద ఉన్న తారకరామ నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వంతెన కింద వర్షపు నీరు నిలువకుండా చూడాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకుడు ఇరిగినేని పుల్లారెడ్డి కోరారు. ఆదివారం లోని ప్రతినిధులతో కలిసి వంతెనను పరిశీలిం చారు. వంతెనను ముందుచూపు లేకుండా నిర్మించడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. మురుగు, వర్షపు నీరు బ్రిడ్జి కింద చేరి స్థానికులు జ్వరాలు, అంటురోగాలతో ఇబ్బంది పడుతున్నారని, వాహనదారులు కిందపడి గాయాల పాలవుతున్నారని వాపోయారు. నగర పాలక సంస్థ, రైల్వే శాఖ సమన్వయంతో పనిచేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదిలక్ష్మి, మస్తాన్, సుంకన్న, సీవి వర్మ, లక్ష్మణ గౌడ్, శ్రీనివాసులు, విజయుడు పాల్గొన్నారు.

పుల్లయ్య కళాశాలలో రక్తదాన శిబిరం

కర్నూలు రూరల్ సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం విజ్ఞాన సేవా సమితి ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి సందర్భంగా రక్తదానం చేశారు. చైర్మన్ పుల్లయ్య, డాక్టర్ చంద్రమౌళి, విజ్ఞాన సేవా సమితి అధ్యక్షుడు రామిరెడ్డి, నందనపల్లె సర్పంచ్ మాధురి భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం డీన్ శశికుమార్ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ శంకర్‌ప్రసాద్ ఆధ్వర్యంలో 52 మంది రక్తదానం చేశారు. పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. డివి రమణారెడ్డి, మద్దిలేటి, వెలుగుల సుంకన్న, కోశాధికారి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకుడు

'జీఎస్టీ తగ్గింపు హర్షణీయం'

సి.బెళగల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రజలపై జీఎస్టీ భారం తగ్గించడం హర్షణీయమని టీడీపీ కన్వీనర్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వస్త్ర దుకాణాలు, పురుగు మందుల డీలర్లకు అవగాహన కల్పించారు. కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్ని నెరవేర్చిందన్నారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి సూచనల మేరకు అవగాహన కల్పింస్తున్నామన్నారు. మాజీ ఎంపిటీసీ దనుంజయుడు, విష్ణు, బీమన్న, గౌస్, ఎంపీటీసీ ఈరన్నగౌడ్ పాల్గొన్నారు.

ఆలయ పనుల సందర్శన

కోడుమూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్మిస్తున్న లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ పనులను వీహెచ్‌పీ దక్షిణ భారతదేశ అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి ఆదివారం సందర్శించారు. ఈ ఆలయ్నాన రాతి స్తంభాలతో రూ.16కోట్లతో పునర్నిర్మిస్తున్నాని, ప్రాచీన ఆలయాన్ని తలపిస్తోందన్నారు. ప్రతాపరెడ్డి, రాజేష్, గురుమూర్తి, చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రొటోకాల్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీఎం, డిప్యూటీ సీఎం, ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలలో ప్రొటోకాల్ పాటించడం లేదని వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్ ఆరోపించారు. ఆదివారం బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ విజయ్‌తో కలసి కలెక్టర్ సిరికి పిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని, మండలస్థాయి కార్యక్రమాలకు ఆహ్వానం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



కలెక్టర్ సిరికి మొక్క ఇస్తున్న మంజునాథ్

తాగి వాహనం నడిపితే చర్యలు

సి.బెళగల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ పరమేష్‌నాయక్ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. ట్రాక్టర్లు, ఆటోల్లో కూలీలను పరిమితికి మించి ఎక్కిస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. రూ 5,845 జరిమాన విధించామని, బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే జరిమానా తప్పదని ఆయన హెచ్చరించారు.

ఉల్లి రైతు కన్నీరు

● ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి ● మార్కెట్‌లో పడిపోయిన ధర ● పొలంలోనే వదిలేస్తున్న రైతులు



వర్కూరు గ్రామంలో ఉల్లిని చూపుతున్న రైతు మద్దిలేటి

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో 5,151 ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. అధిక వర్షాల దెబ్బకు పంట దెబ్బతింది. ధర పడిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

మద్దతు ధర ఎత్తివేయడంతో నష్టం..

మొన్నటి వరకు ప్రభుత్వం రూ.1,200ల మద్దతు ధరతో కొనుగోలు చేసినా దాన్ని ఎత్తివేయడంతో నష్టం వస్తోంది. ప్రభుత్వం హెక్టారుకు రూ.50వేల సాయం ప్రకటించినా ఆ లెక్కన ఎకరాకు రూ.20వేలు ఇస్తుండటంతో గిట్టుబాటు అయ్యే అవకాశం లేదు. ఈ ధర ఉల్లిని కోతకోసి మార్కెట్‌కు తరలించేందుకు కూడా సరిపోదని రైతులు అంటున్నారు.

ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి

ఉల్లి సాగుకు ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చు అవుతోందని రైతులు అంటున్నారు. నారు మొదలు కలుపు, ఎరువులు, కూలీల ఖర్చులు మొత్తం భారంగా మారాయి. అయితే ధర పడిపోవడంతో కనీసం పెట్టుబడి కూడా వచ్చేలా లేదని రైతులు వాపోతున్నారు.

వ్యాపారుల మాయాజాలం

ఉల్లిని విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకెళ్లగా వ్యాపారుల మాయాజాలంతో రైతులు అల్లాడిపోతున్నారు. క్వింటాలుకు రూ.50ల నుంచి రూ.500 లోపు కొంటుండగా, ఒకటిరెండు లాట్లు మాత్రమే రూ.900లకు కొనుగోలు చేస్తుండటంతో రైతులకు దిక్కుతోచడం లేదు. ఇంటిల్లిపాదీ కష్టించినా పెట్టుబడి కూడా రావడం లేదని వాపోతున్నారు.

దెబ్బతీసిన వర్షాలు

బావుల కింద సాగుచేసిన ఉల్లి 80-90 రోజుల్లో చేతికందుతుంది, వర్షాధారమైతే 110-120 రోజుల్లో వస్తుంది. తీరా దిగుబడి వచ్చే సమయంలో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో విస్తారంగా వర్షాలు పడడంతో పొలాల్లో తేమ అధికమై ఉల్లి దిగుబడి తగ్గిపోయింది. ఎకరాకు 50 కింటాళ్లు మించడం లేదు. ఏదైమైనా మళ్లీ ధర వస్తుందన్న ఆశతో కొందరు రైతులు ఉల్లిని కల్లానికి చేరిచ రోజూ గ్రేడింగ్ చేసుకుంటున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఐదెకరాల్లో ఉల్లిని వదిలేశా



ఖరీఫ్‌లో ఐదెకరాల్లో ఉల్లిసాగు చేశా, సుమారు రూ.5లక్షలు ఖర్చు అయ్యింది. ఉల్లిని కోసి మార్కెట్‌కు తరలిస్తే నష్టం వస్తోంది. - ఈశ్వరయ్య, ప్యాలకుర్తి

మద్దతు ధర కొనసాగించాలి



రెండెకరాల్లో ఉల్లిసాగు చేశాను. ఎకరాకు రూ.లక్ష ఖర్చయ్యింది. రెండురోజుల క్రితం ఎకరా ఉల్లిని కోశా. ప్రభుత్వం మద్దతు ధర తొలగించినట్లు ప్రకటించారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారంతో కోత, కల్లంలో చేర్చడానికే సరిపోతాయి. - రమేశ్, వర్కూరు

దొంగ ఓట్లతో గద్దెనెక్కిన బీజేపీని దించేద్దాం

నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్



పోస్టర్ విడుదల చేస్తున్న లక్ష్మీనరసింహాయాదవ్

కల్లూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో దొంగ ఓట్లతో గద్దెనెక్కిన బీజేపిని గద్దెదించేందుకు లక్ష సంతకాల సేకరణ నిర్వహించనున్నట్లు నంద్యాల జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల చెక్‌పోస్టు దామోదరం సంజీవయ్య కాంగ్రెస్ భవన్‌లో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్‌పార్టీ దేశవ్యాప్త ఉద్యమం పోస్టర్లు విడుదల చేశారు. అక్టోబరు 15 వరకు దేశవ్యాప్తంగా పార్టీ తలపెట్టిన లక్ష సంతకాల సేకరణ ఉద్యమాన్ని జయప్రదం చేయాలని నాయకులను కోరారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని ఆరోపించారు. ఫొటోలతో స్పష్టమైన ఓటర్ల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, ఎన్నికల ముందు జాబితాలో చేసిన మార్పులు, చేర్పులను బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల చివరి నిమిషంలో ఓట్ల తొలగింపు, చేర్పులను నివారించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పఠాన్ అబిబ్‌ఖాన్, రమణ, జనార్ధన్, రజాక్‌వలి, షేక్ జాకీర్ హుసేన్ పాల్గొన్నారు.

బందోబస్తులో ఉంటూనే కేసు ఛేదింపు

● ఆత్మకూరు ఎస్‌ఐను అభినందించిన ఎస్పీ

ఆత్మకూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తిరుమలలో జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల బందోబస్తులో ఉంటూనే ఓ అదృశ్యం కేసును ఆత్మకూరు ఎస్‌ఐ ఛేదించారు. దీంతో ఆయనను ఆదివారం ఎస్పీ సునీల్ షెరాన్ అభినందించారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. ఆత్మకూరు మండలంలోని కొట్టాలచెరువులో శాంతిబాయి అనే మహిళ నివసించేది. ఆమె భర్త చనిపోవడంతో శ్రీశైలంలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తుండేది. ఈక్రమంలోనే పలమనేరుకు చెందిన మూర్తితో పరిచయం ఏర్పడి రెండో పెళ్లి చేసుకుంది. ఆ తర్వాత ఇంటి నుంచి వెళ్లిపోయి తిరుమలలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తుంది. మొదటి భర్త కుమారుడైన విశ్వేశ్వరనాయక్ 2023 మే 16వ తేదీన ఆత్మకూరు పోలీసులకు తన తల్లి అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. కేసును ఛేదించేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం తిరుమలలో జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల నిర్వహణలో బందోబస్తు కోసం ఎస్‌ఐ నారాయణరెడ్డి తిరుమలకు వెళ్లారు. యాధృచ్ఛికంగా శాంతిబాయి వివరాలు లభ్యం కావడంతో ఆమె ఆచూకీని గుర్తించారు. ఆత్మకూరు పోలీసుస్టేషన్‌కు చెందిన మహిళా పోలీసు కానిస్టేబుల్ స్వర్ణ సహాయంతో వాగ్మూలం రికార్డు చేయించారు విశ్వేశ్వరనాయక్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. శాంతిబాయిని ఆమె రెండో భర్త మూర్తికి అప్పగించారు. 2023లో నమోదైన మిస్సింగ్ కేసును బాధ్యతాయుతంగా ఛేదించిన ఎస్‌ఐ నారాయణరెడ్డిని ఎస్పీ అభినందించారు.

తామ్ర శాసనాలపై పుస్తకం రూపకల్పన

● ఏఎస్‌ఐ డైరెక్టర్ మునిరత్నం



రాగిరేకులను పరిశీలిస్తున్న అమిషా (ఫైల్)



శ్రీశైలం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో గల ఘంట మఠంలో 2021లో లభ్యమైన తామ్రశాసనాలపై పుస్తకాన్ని రూపొందించినట్లు ఏఎస్ఐ (ఆర్కియాజికల్ సర్వే ఆఫ్ ఇండియా)మైసూర్ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. తామ్రశాసనాలపై లిఖించిన వాటిని డైరెక్టర్ ఎపిగ్రఫి మైసూర్ వారు 'హర్డ్ ఆఫ్ కాపర్ ప్లేట్స్ ఫ్రమ్ శ్రీశైలం' అనే పుస్తకాన్ని తయారు చేశారన్నారు. అమిత్‌షా కూడా శ్రీశైలాన్ని సందర్శించినప్పుడు డిస్‌ప్లేలో ఉంచిన తామ్రాశాసనాలను పరిశీలించారు. అక్టోబరు 16న ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం రానున్నారు. ఈ సందర్భంగా తామ్రాశాసనాలు(రాగిరేకులు) గురించి డిస్‌ప్లేలో ఉంచుతారని దేవస్థాన అధికారులు తెలిపారు. ప్రధాని చేతులమీదుగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరిస్తామని సీఎం నారా చంద్రబాబునాయుడు, దేవదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి నిర్ణయించినట్లు తెలిసింది.



బీట్ కేర్‌ఫుల్

● వ్యాయామంతోనే గుండె పదిలం
● ఆధునిక జీవన శైలే కారణం
● చిన్న వయస్సులోనే హార్ట్ ఎటాక్
● నేడు వరల్డ్ హార్ట్ డే

మన గుండె ఉండేది పిడికెడే. నిలువెత్తు మనిషిని నడిపిస్తుంది. ఇటీవల కాలంలో గుండె లయ తప్పుతోంది. గుండె పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలి. యువత, టీనేజర్లు గుండెపోటుతో కుప్పకూలుతున్న ఘటనలు ఉమ్మడి జిల్లాలో ఎక్కువయ్యాయి. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారిలో అత్యధికులు గుండె జబ్బులతో సతమతమవుతున్నారు. కరోనా అనంతరం చోటుచేసుకున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లులోని మార్పులు, హార్ట్ ఎటాక్‌లకు కారణమవుతున్నాయి. గుండె జబ్బులపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు 2000 సంవత్సరం నుంచి వరల్డ్ హార్ట్ ఫెడ రేషన్ ఏటా సెప్టెంబరు 29న వరల్డ్ హార్ట్‌డే నిర్వహిస్తుంది. ఈఏడాది 'డోంట్ మిస్ బీట్ ' అన్న నినాదాన్ని ఇచ్చింది. వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం.



కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గుండె జబ్బులతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతుంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఏటా 30వేల మంది రోగులు చికిత్స పొందుతుంటారు. కర్నూలు జీజీహెచ్‌లోని కార్డియాలజి విభాగానికి 2024-25 సంవత్సరానికి 22,325 మంది ఓపీ కేసులు రాగా, ఇందులో 4,281మంది అడ్మిషన్ పొంది చికిత్స పొందుతుంటారు. కర్నూలు జీజీహెచ్‌కు ప్రతి రోజూ 3వేల మంది ఓపీకి వస్తుండగా.. ఇందులో 60 నుంచి 70 కేసులు హార్ట్ ఎటాక్ లక్షణాలతో చికిత్స పొందుతుంటారు. ఇందులో 25నుంచి 40ఏళ్లలోపు ఉన్నవారు ఎక్కువగా గుండె జబ్బుల బారిన పడుతున్నారు. ప్రతి నెల కార్డియాలజీకి ఓపీకి 1300 నుంచి 1400 మంది రోగులు రాగా, ఇందులో 300 నుంచి 350 మంది అడ్మిషన్ అయి చికిత్స పొందుతుంటారు. ప్రతిఏడాది కార్డియాలజి వైద్యులు 1,235 మందికి అంజి యోగ్రామ్, 423 మందికి అంజియోప్లాస్టి చికిత్సలను డా.ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఉచితంగా నిర్వహిస్తున్నారు.

పట్టణాల్లో ఎక్కువ

జీవనశైలిలో మార్పులే గుండెపోటుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. యువతలో గుండె సమస్యలు అధికమయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని పట్టణాలతో పాటు గ్రామాల్లోను అందరి ఆహారపు అలవాట్లు మారాయి. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు బేకరీ, జంక్‌ఫుడ్, మాంసాహారం, మసాలా, బిర్యానీలు ఎక్కువగా తింటున్నారు. దీని వల్ల శరీరంలో కొవ్వు శాతం పెరిగిపోయి ఆయాసం, నీరసం ఇతర సమస్యలకు కారణమవుతున్నాయి. గతంలో 50ఏళ్లు దాటిన వారికి మాత్రమే గుండెపోటు వచ్చేది. ప్రస్తుతం 25ఏళ్ల వారు సైతం దీని బారినపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో 13 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 8 శాతం మంది గుండె జబ్బుల బారిన పడుతున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

● ప్రతిరోజు 45 నిమిషాలు వ్యాయామం చేయాలి. యోగా, ధ్యానం చేయాలి. బచ్చలకూర, కాలిఫ్లవర్, టమోటా, క్యాబేజీ, క్యారెట్, పాలకూర, కూరగాయలు తీసుకోవాలి. పొగాకు ఉత్పత్తులు, మద్యపానంకు దూరంగా ఉండాలి. కొలస్ట్రాల్ స్థాయిని తగ్గించుకుని బీపీ, షుగర్ వ్యాధిని తగ్గించుకోవాలి.

● సంగీతం వినాలి. పాతపాటలు మనస్సుకు ఎంతో హాయిని ఇచ్చి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ప్రతిరోజు 7నుంచి 8గంటలు బాగా నిద్రపోవాలి. నూనెలో వేయించిన ఆహారాన్ని తగ్గించాలి. కొర్రలు, సజ్జలు, జొన్నలు, బ్రౌన్ రైస్, ఓట్స్ వంటి తృణధాన్యాలు తీసుకోవాలి.

ప్రతి రోజు 30 కేసులు



కార్డియాలజి విభాగానికి ప్రతి రోజూ ఓపీ ఉంటుంది. ఓపీకి రోజూ 30 కేసులు వస్తుంటాయి. మంగళ, శుక్రవారాల్లో ఒక్కొక్కరికి ఓపీకి 200 మంది రోగులు వస్తారు. చెస్ట్ పెయిన్, ఆయాసం లక్షణాలతో రోగులు రాగా, వారికి ఈసీజీ, టుడి ఇకో పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారిస్తాం.

● డాక్టర్ పి.ప్రశాంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్, కార్డియాలజి, జీజీహెచ్, కర్నూలు

గుండె ఆరోగ్యం మన చేతిలోనే



ప్రపంచ వ్యాప్తంగా గుండె జబ్బులు మరణాలకు ప్రధాన కారణంగా మారాయి. గతంలో వృద్ధుల్లో మాత్రమే హార్ట్ ఎటాక్‌లు కనిపించేవి. ఇప్పుడు యువతలో కూడా వేగంగా పెరిగాయి. గుండె ఆరోగ్యం మన చేతిలోనే ఉంది. రోజు నడక, వ్యాయామంతో పాటు ధ్యానం అలవాటు చేసుకోవాలి.

- డా.సీఎస్ తేజానందన్ రెడ్డి, కన్సల్టెంట్ ఇంటర్వేన్షనల్ కార్డియాలజిస్టు, మెడికవర్ హాస్పిటల్, కర్నూలు

నిర్లక్ష్యం వద్దు



గుండెనొప్పి అరగంట కన్నా ఎక్కువగా ఉంటే నిర్లక్ష్యం చేయరాదు. అది హార్ట్ ఎటాక్‌లా భావించాలి. చెమట పడటం, చేయిలాగడం, నడిస్తే ఆయాసం రావడం వంటి లక్షణాలు ఉంటే వైద్యున్ని సంప్రదించాలి.

● డాక్టర్ సందీప్‌కుమార్, ఇంటర్వేన్షనల్ కార్డియాలజిస్టు కిమ్స్ హాస్పిటల్, కర్నూలు

పొగాకు వినియోగం..



గుండె జబ్బులు రావడానికి పొగాకు వినియోగం ముఖ్య కారణం. ప్రధానంగా స్మోకింగ్ చేసే అలవాటు ఉన్న వారిలో హార్ట్ ఎటాక్ ఎక్కువగా వస్తుంది. స్మోకింగ్, ఆల్కహాల్ వంటివి గుండె కండరాలపై ప్రభావం చూపుతాయి.

- డాక్టర్ అనిరుధ్‌కుమార్, ఇంటర్వేన్షనల్ కార్డియాలజిస్టు, విజయదుర్గ కార్డియాక్ సెంటర్, కర్నూలు

గుండెను కాపాడుకోవాలి

-మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్



జ్యోతి ప్రజ్వలనకు హాజరైన అతిథులు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మద్యపానం, ధూమపానం వంటి దుర అలవాట్లకు దూరంగా ఉండి గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేశ్ పిలుపునిచ్చారు. నగరంలోని హెల్త్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన వరల్డ్ హార్ట్ డే వేడుకలకు టీజీ వెంకటేశ్‌తో పాటు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ముందుగా హైదరాబాదు అపోలో హాస్పిటల్‌కు చెందిన సీనియర్ కార్డియాలజిస్టు ప్రతాప్ చంద్రరత్‌కు అవుట్ స్టాండింగ్ పర్సన్ ఆఫ్ ఇయర్ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ గుండె జబ్బుల పట్ల ప్రజలు అవగాహన పెంచుకోవాలని, ఇటీవల కాలంలో యువత గుండెజబ్బుల బారిన పడుతున్నారన్నారు. దీని కారణాలను వైద్యులు విశ్లేషించాలన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ 50 శాతం మంది గుండె జబ్బులతో మరణిస్తున్నారన్నారు. ప్రతిరోజు 40 నిమిషాలు నడవడం, యోగా, సరైన ఆహార నియమాలు పాటిస్తే హృద్రోగ సమస్యలు తలెత్తవన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ హెల్త్‌వర్సిటీ వీసీ చంద్రశేఖర్, హార్ట్ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ భవాని ప్రసాద్, వసంత్ కుమార్, చంద్రశేఖర్, కేవీ సుబ్బారెడ్డి, పొలిటికల్ అనలిస్ట్ నాగేశ్వర్ బాబు, రిటైర్డు డీఎస్పీ మహబూబ్ బాషా, కేసీ రాముడు, శర్మ పాల్గొన్నారు.

సమ సమాజ కృషీవలుడు జాషువా

- కవులు, కళాకారుల ఘన నివాళి



గుర్రం జాషువా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కళారత్న పత్తి ఓబులయ్య, సాహితీవేత్తలు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమ సమాజం కోసం తన రచనలతో మార్పు తీసుకొచ్చిన సాహితీ కృషీవలుడు గుర్రం జాషువా అని పలువురు కవులు, కళాకారులు కొనియాడారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో నవయుగ కవి చక్రవర్తి, కవి కోకిల, పద్మభూషణ్ గుర్రం జాషువా 130వ జయంతి సభను ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్ర పటానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. సభకు అధ్యక్షత వహించిన కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్య మాట్లాడుతూ జాషువా ఉపాధ్యాయుడిగా, కవిగా, సంఘ సంస్కర్తగా నమ్మిన సిద్ధాంతంతో ముందుకు పోయారన్నారు. ఆయన రాసిన క్రీస్తు చరిత్ర పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అన్నారు. శాసన మండలిలోనూ రాజకీయాలకు బదులు ఆయన పద్యాలు వినిపించేవారని అన్నారు. కథా రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ మాట్లాడుతూ సంప్రదాయ వాదానికి విరుద్ధంగా ఆయన రచనలు చేశారని, అనేక అంశాలను ఆయన ప్రశ్నిస్తూ చైతన్య గీతాలు రాశారని గుర్తు చేశారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ జాషువా రాసిన గబ్బిలం పుస్తకంపై మాట్లాడుతూ జాషువా సాహిత్యంలో అత్యంత ప్రతిభాశాలి అయినా సామాన్యులకు అర్థమయ్యే భాషలోనే పద్యాలు రాశారని అన్నారు. కులతత్వానికి వ్యతిరేకంగా ఈ కావ్యం ఉంటుందని తెలిపారు. డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి మాట్లాడుతూ జాషువా రాసిన పిరదౌసి కావ్యం ప్రత్యేక గుర్తింపును అందుకుందన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, గజల్ గాయకుడు మహమ్మద్ మియా, సాహితీ స్రవంతి ప్రతినిధి ఎంపీ బసవరాజు, కళాకారులు కేవీ రమణ, శామ్యూల్, వాల్మీకి రాముడు, చల్లా నవీన్ కుమార్ నాయుడు జాషువా రాసిన కావ్యాల్లోని పద్యాలను పాడి ప్రేక్షకులను మెప్పించారు. కార్యక్రమంలో కవులు, కళాకారులను టీజీ వీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య శాలువలతో ఘనంగా సత్కరించారు. కళాక్షేత్రం కార్యదర్శి సి.యాగంటీశ్వరప్ప, ఇత టర ప్రతినిధులు పి.రాజారత్నం, జీవీ శ్రీనివాసరెడ్డి, రిటైర్డ్ తహసీల్దార్ శంకరప్ప, ఉపాధ్యాయురాలు హసీనా, గద్వాల ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

అహోబిలంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు



అహోబిలంలో ప్రహ్లాదవరద స్వామి, శ్రీదేవి, భూదేవి, అమృతవల్లి అమ్మవార్ల గ్రామోత్సవం

ఆళ్లగడ్డ, సెప్టెంబర్ 28(ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం దిగువ అహోబిలంలో అద్దాల మండపంలో ప్రహ్లాదవరద స్వామి, శ్రీదేవి, భూదేవి, అమృతవల్లి అమ్మవార్లకు ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్, మణియర్ సౌమ్యనారాయణన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పల్లకి సేవ నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నందికొట్కూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పురుగుమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. వివరాలు.. ఓర్వకల్లు మండలం నన్నూరుకి చెందిన ఖాజాభాష(30) భార్య చెప్పకుండా పుట్టింటికి వెళ్లిందని మనస్తాపానికి గురై నందికొట్కూరుకు వచ్చాడు. శివారులోని మిడ్తూరు రోడ్డులో ఈనెల 10వ తేదీన పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. రైతులు, కూలీలు చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు.

అనకాపల్లిలో రోడ్డు ప్రమాదం..

కర్నూలు వాసి దుర్మరణం

అనకాపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం పులపర్తి జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నూలు జిల్లాకు చెందిన ఓ నేవీ ఉద్యోగి మృతిచెందారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా... కర్నూలు నగరంలోని కృష్ణానగర్ ప్రాంతానికి చెందిన పి.రఘురామిరెడ్డి నేవీలో ఉద్యోగం చేస్తున్నారు. కొంతకాలం నుంచి హైదరాబాద్ నగర శివారులోని అల్మాస్‌గుడ వినాయక హిల్స్‌లో నివాసం వుంటున్నారు. వ్యక్తిగత పనిమీద విశాఖపట్నం వచ్చిన ఆయన ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై జాతీయ రహదారి మీదుగా రాజమహేంద్రవరం వైపు వెళుతున్నారు. ఎలమంచిలి మండలం పులపర్తి జంక్షన్ వద్ద రోడ్డు దాటుతున్న పులి మల్లికార్జున్ అనే స్థానికుడిని బలంగా ఢీకొన్నారు. దీంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నది. నుదుటిపై బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. మల్లికార్జున్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఇతనిని ఎలమంచిలి సీహెచ్‌సీకి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎలమంచిలి రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి, మృతునివద్ద లభించిన ఆధారాలతో కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పారు.



నందవరంలో శ్రీ కాత్యాయనీమాత కాళరాత్రి అలంకారంలో శ్రీచౌడేశ్వరీమాత అమ్మవారు



గూడూరు: మహాఛండీ అలంకరణలో సుంకులా పరమేశ్వరి అమ్మవారు




నంద్యాల: సత్యసాయి మందిరంలో లక్ష్మీనారాయణ అలంకరణ



కర్నూలులోని గోదా గోకుల క్షేత్రంలో మహాలక్ష్మిదేవి అలంకరణ



కల్లూరు అమ్మవారిశాలలో బ్రహ్మదేవుని అలంకరణ



మంత్రాలయం: రజత సింహ వాహనంపై మంచాలమ్మను అలంకరించిన దృశ్యం

ఆధ్యాత్మిక వీచికలు.. ధార్మిక భావనలు

- ఏడో రోజున అమ్మవారికి విశేష అలంకరణలు

కర్నూలు కల్చరల్/ బనగానపల్లె/ మంత్రాలయం/గూడూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. అన్ని ఆలయాల్లోనూ ఆధ్యాత్మిక వాతావరణం ప్రతిబింబిస్తోంది. వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన అమ్మవారి విగ్రహాలకు భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం కర్నూలు పూలబజార్‌లోని చిన్న అమ్మవారిశాలలో అమ్మవారు వారాహిదేవి అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. పాతనగరంలోని గీతామందిరంలో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ద్వాదశ ఆదిత్యుల అలంకరణలో కనిపించారు. గోదాగోకుల క్షేత్రంలో అమ్మవారికి మహాలక్ష్మిదేవి అలంకరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. కల్లూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు బ్రహ్మదేవుడు, లలితా పీఠంలో అమ్మవారిని పసుపుతో అలంకరించారు.

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ రజత సింహవాహనంపై దర్శనమిచ్చారు. పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బనగానపల్లె మండలం నందవరంలోని చౌడేశ్వరీమాత కాళరాత్రి మాత అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. గూడూరు మండలం కె.నాగులాపురంలో సుంకులా పరమేశ్వరి అమ్మవారు మహాచండీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

కాళరాత్రిదుర్గగా కామేశ్వరీదేవి



మహానందిలో సహస్రదీపాలంకరణ సేవ నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది: మహానంది క్షేత్రంలో దసరా ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం కామేశ్వరీ అమ్మవారు కాళరాత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆలయంలో హోమాలు, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా వర్షం కారణంగా రాత్రి అమ్మవారి గ్రామోత్సవాన్ని రద్దు చేశారు. ఉత్సవ ఏర్పాట్లను ఇన్‌చార్జి పర్యవేక్షకుడు పసుపుల సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి

మద్దికెర సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత గుర్రం జాషువ సేవలు ఎన్నటికీ మరువలేనివని మండల బీజేపీ అధ్యక్షులు బురుజుల శంకర్‌బాబు అన్నారు. ఆదివారం మద్దికెర గ్రామంలో గుర్రం జాషువ 130వ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే బీజేపీలోకి బురుజుల, అగ్రహారం గ్రామాలకు చెందిన విజయకుమార్, దాసరి బాలాంజనేయులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రశేఖర్ యాదవ్, హంసా నాగరాజు, శ్రీనివాసులు, మనోహర్ చౌదరి, మల్లేష్ తదితరులు ఉన్నారు.

'డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తాం'

వెల్దుర్తి టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎక్కడ, ఎవరికీ ఏ అన్యాయం జరిగినా ఈ-డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తామని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. వెల్దుర్తిలో కార్యాలయంలో ఆదివారం డిజిటల్ స్కాన్ల బుక్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ డిజిటల్ బుక్ స్కాన్లలో ఒకటి డిజిటల్ బుక్ పోర్టల్‌లో పిర్యాదు చేయొచ్చని తెలిపారు. వైసీపీ కార్యకర్తలు, అన్యాయానికి గురైన బాధితులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. టీడీపీ పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని విమర్శించారు. మళ్లీ జగన్ అధికారంలోకి వస్తాడని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సమీర్ కుమార్ రెడ్డి, వెల్దుర్తి, కృష్ణగిరి వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నామమాత్రంగా సర్వసభ్య సమావేశం

ఆదోని రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎంపీటీసీలు సంతకాలుపెట్టి సమావేశం తూతూ మంత్రంగా సాగించారు. ప్రతి మూడు నెలలకొక్కసారి జరిగే సర్వసభ్య సమావేశం ఈనెల 17వ తేదీన నిర్వహించారు. మెజార్టీ ఎంపీటీసీలు హాజరు కాకపోవడంతో అధికారులు వాయిదా వేశారు. అయితే ఎంపీపీ వైసీపీ నుంచి బీజేపీలోకి వెళ్లడంతో మెజార్టీ ఎంపీటీసీలు ఆమెను దించడానికి ఈనెల 25వ తేదీన అవిశ్వాసం తీర్మానం కోరుతూ, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇదిలా ఉండగా, ఆదివారం మరోమారు మండల అధికారులు సమావేశం నిర్వహించారు. ఎంపీపీ బడాయి దానమ్మ సమక్షంలోనే వారంతా ఆవేదన వ్యక్తంచేశారు. తమ పార్టీ నుంచి ఎన్నికై బీజేపీలోకి వెళ్లిన ఆమె ఎంపీపీగా ఉండడానికి అనర్హురాలని, కొత్త ఎంపీపీ వచ్చేంతవరకు మండల సమావేశానికి వచ్చేది లేదంటూ వాకౌట్ చేస్తూ, కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈక్రమంలో అధికారులు వైసీపీ ఎంపిటీసీలకు నోటీసులు అందజేశారు. అవిశ్వాస తీర్మానం సమావేశం అక్టోబరు 22వ తేది ఉంటుందని, కావున అందరూ హాజరు కావాలంటూ వారికి తెలియజేశారు. సమావేశంలో ఎంపీడీవో జనార్ధన్, ఎంపీపీ బడాయి దానమ్మ, పాల్గొన్నారు.

'బాలకృష్ణ మాటలు విడ్డూరం'

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తమ వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డిపై ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడడం విడ్డూరంగా ఉందని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన తన నివాసంలో కార్యకర్తలతో కలిసి వైసీపీ డిజిటల్ పోర్టల్ గోడ పత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కర్యదర్శి మహేంద్ర రెడ్డి, ఫయాజ్, వెంకటేశ్వర్ రెడ్డి, దేవా పాల్గొన్నారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో..

ఆదోని రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్ తమకు స్ఫూర్తి అని భగత్ సింగ్ ఫౌండేషన్ అధ్యక్షుడు తాహేర్ వలి తెలిపారు. ఆదివారం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి ఉచిత అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. భగత్ సింగ్ స్ఫూర్తితో ఆయనబాటలో నడుస్తూ, డాక్టర్ల సూచనలతో రోగులను కర్నూలు, బళ్ళారి, రాయచూరు, తదితర ప్రాంతాల ఆసుపత్రులకు ఉచితంగా సర్వీస్ చేస్తుందని, కేవలం వాహనానికి డిజిల్ మాత్రమే వేయించుకోవాలన్నారు. అంబులెన్స్ కావాల్సిన వారు 99515 94021, 9951594017లను సంప్రదించాలన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి



వైకుంఠం జ్యోతిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

హొళగుంద, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని, అప్పుడే వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ వైకుంఠం జ్యోతి అన్నారు. ఆదివారం దేవరగట్టు మళ మల్లేశ్వర స్వామి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈడిగ గోవింద్ గౌడ్ ఆధ్వర్యంలో వైకుంఠం జ్యోతి, వైకుంఠం ప్రసాద్‌లను పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గం టీడీపీ పార్టీ వర్గాలకు తావు లేకుండా అందరిని కలుపుకొని పార్టీకి పూర్వ వైభోగం తీసుకొస్తామని తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ వీరన్న గౌడ్, రాజేంద్ర గౌడ్, గుబ్బళి లక్ష్మమ్మ, అయ్యాలప్ప, దిడ్డి నాగప్ప, గజ్జెహళి గిరి మల్ల పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో వీహెచ్‌పీ సేవలు విస్తరించాలి

ఆదోని టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి గ్రామంలో విశ్వహిందూ పరిషత్ సేవలను విస్తరించాల్సిన అవసరం ఉందని, హిందూ సమాజ సంఘటన కోసం ప్రతి కార్యకర్త ముందుకు వచ్చి కృషి చేయాలని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయి రెడ్డి అన్నారు. ఉరుకుంద వీరన్న పుణ్యక్షేత్రంలోని అమావాస్య అన్నదాన సత్రం ప్రాంగణంలో ఆదివారం విశ్వహిందూ పరిషత్ జిల్లా సమావేశం నిర్వహించారు. నందిరెడ్డి సాయి రెడ్డి మాట్లాడుతూ బజరంగ్ దళ్ యువతను సమాజసేవ ధర్మరక్షణ వైపు నడిపించాలని గ్రామస్థాయి నుండి శక్తివంతమైన హిందూ సంఘటన నిర్మాణం జరిగితే దేశం ఎంతో అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందన్నారుసమావేశంలో పరిషత్ రాష్ట్ర నాయకులు శ్రీనివాసరెడ్డి, ప్రతాప్ రెడ్డి, గురుమూర్తి, బజరంగ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాజేష్, జిల్లా నాయకులు రాధారెడ్డి, హనుమంత్ రెడ్డి, రంగన్న, ఉపేంద్ర రెడ్డి, మారుతీ మోహన్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

తుగ్గలి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి):సైబర్ నేరాల వల్ల చాలా అనర్థాలు జరుగుతాయనీ, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున అన్నారు. ఆదివారం జొన్నగిరిలో సైబర్ నేరాలు, మహిళలపై వేదింపులు వంటి చట్టాలపై ఎస్ఐ అవగాహన కల్పించారు.

ఆదోని వరద బాధితులకు టీడీపీ చేయూత



వరద బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న మారుతినాయుడు

ఆదోని, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వాటి కారణంగా లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి చేరిన వరదనీటి వల్ల నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు టీడీపీ ముందుకు వచ్చిందని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు సూచనల మేరకు, యువ నాయకుడు మారుతి నాయుడు ఆధ్వర్యంలో వరద బాధితులకు భారీగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ముందురోజు 2 వేల మందికి ఆహారం పొట్లాలు పంపిణీ చేయగా, ఆదివారం వరద బాధితులకు నిత్యావసరాలను పంపిణీ చేపట్టారు. సుమారు 1000 కుటుంబాలకు ప్రయోజనం చేకూరేలా, రూ.9 లక్షల నుంచి రూ.10 లక్షల విలువ గల నిత్యావసర సరుకుల కిట్లను అందించారు. ఈ కిట్లలో బియ్యం, పప్పు, కారం, ఉప్పు, చింతపండు, చక్కెర, వంటనూనె వంటి ముఖ్యమైన సరుకులు ఉన్నాయి.ఈ సహాయక కార్యక్రమాన్ని పట్టణంలోని కౌడల్‌పేట, బార్‌పేట, వడ్డేమాన్ కాలనీ, ప్రశాంతినగర్ తదితర లోతట్టు ప్రాంతాల్లోని బాధితులకు అందించారు.



పంపిణీకి సిద్ధంగా ఉన్న నిత్యావసర సరుకుల కిట్లు

పేదలను ఆదుకోవడంలో మారుతినాయుడు ముందుంటారు

నారా లోకేష్ స్ఫూర్తితో పేద ప్రజలను ఆదుకోవడంలో టీడీపీ యువ నాయులు మారుతినాయుడు ఎల్లప్పుడూ ముందుంటారని ప్రజలు తెలిపారు. ఆదోనిలో ఏ సమస్య అయినా ఆయన దృష్టికి తీసుకెళ్తే వెంటనే స్పందించి పరిష్కరించేందుకు కృషి చేస్తారని తెలిపారు. ఈ కిట్ల పంపిణీలో సుబ్బు, లక్ష్మీనారాయణ, లక్ష్మన్న, నాగరాజు, సజ్జత్ హుసేన్, శంకర్, గురు, నవీన్, వినయ్, వీరేంద్ర, శ్రీరాములు, సోషల్ వర్కర్ అబ్దుల్ రెహమాన్లతో పాటు నాయకులు పాల్గొన్నారు.

యువకుడిని కాపాడిన గ్రామస్థులు

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మండలం హోసూరు గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న హంద్రీనీవా కాలువలో ఆదివారం పడి కొట్టుకుపోతుండడంతో ప్రాణాలకు తెగించి గ్రామస్థులు ఆ యువకుడిని ఒడ్డుకు చేర్చి కాపాడారు. గ్రామానికి చెందిన మాల కళ్యాణ్ అనే యువకుడు (మతిస్థిమితం లేదు) స్వగ్రామం నుంచి పత్తికొండ వైపు వస్తుండగా హంద్రీనీవా కాలువ బ్రిడ్జి దగ్గరకు రాగానే అటువైపు వాహనాలు వస్తుండడం చూసి బిత్తరపోయి పక్కనే ఉన్న కాలువ వైపు పరిగెత్తి కాలుజారి కాలువలోకి పడిపోయాడు. గమనించిన గ్రామస్తులు జయకృష్ణ, ఉసేనిలు కాలువలోకి దిగి కొట్టుకుపోతున్న కళ్యాణ్‌ను ఒడ్డుకు చేర్చి ప్రాణాలు కాపాడారు.

టీడీపీ క్యాడర్‌ను ఒకే తాటిపైకి తీసుకొస్తాం

ఆలూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గంలో టీడీపీ క్యాడర్‌ను ఒకే తాటిపైకి తీసుకొస్తామని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్‌లు అన్నారు. ఆదివారం ఆలూరు పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు వారిని కలిసి సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బిల్లేకల్ వెంకటేష్, టీడీపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, నరసప్ప, ముద్దురంగ, వెంకన్న, నెట్టప్ప, రామాంజినేయులు, జగన్, ఉలిగప్ప, హనుమప్ప, జిలానీ, రాజు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఆదోని, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరంలా మారిందని టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు అన్నారు. ఆదివారం ఆదోనిలో ఆయన స్వగృహంలో 37 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.15.71 లక్షలు విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీనాక్షినాయుడు మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో దోహదపడుతోందని, ఇది వారికి ఊరటనిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రామస్వామి, అప్సర్‌బాషా పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

ఆదోని టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేద కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ సభ్యులు న్యాయవాది లలిత జితేంద్ర వారి తల్లి పార్వతమ్మ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ జిల్లా చైర్మన్ డా.గోపీనాథ్ మాట్లాడుతూ, తమ కుటుంబ పెద్దల జ్ఞాపకార్థం పేద కుటుంబాలను ఆదుకునే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మరో జిల్లా చైర్మన్ ప్రసాద్ రావు, అధ్యక్ష, కార్యదర్శులు ధర్మారెడ్డి, శ్రీనాథ్ గుప్తా, ఓం ప్రకాష్, రవీంద్ర, రాజేంద్ర, నీలా మోహన్, గోవిందరాజు, మూర్తి పాల్గొన్నారు.

శ్రీశైలంలో తుగ్గలి నాగేంద్ర దంపతుల ప్రత్యేక పూజలు

తుగ్గలి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి):దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని శ్రీశైలం క్షేత్రంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ సభ్యులు వరలక్ష్మి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం శ్రీశైలంలో మల్లికార్జున స్వామి, భ్రమరాంబదేవి అమ్మవార్లను దర్శించుకుని వేద పండితుల ఆశీర్వచనాలతో ప్రత్యేక పూజలు చేశారు. వారికి పండితులు ఆశీర్వాదాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. రాష్ట్ర ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని పూజలు చేశామని తెలిపారు.



మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకున్న నాగేంద్ర దంపతులు

పంపకాలలో పేచీతో సమావేశం వాయిదా

ఆదోని టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : శనివారం 27వ తేదీన జరగాల్సిన కౌన్సిల్ సాధారణ సమావేశం హఠాత్తుగా వాయిదా పడింది. కౌన్సిల్ సభ్యులందరికి సమావేశానికి సంబంధించిన అజెండాను 26వ తేదీన ఉదయం పంపిణీ చేసిన అధికారులు తిరిగి సాయంత్రానికి సమావేశం వాయిదా పడ్డట్టు ఫోన్ ద్వారా సభ్యులకు సమాచారం అందించారు. పారిశుధ్య పనులు కోసం 50మంది కార్మికులను కాంట్రాక్టు పద్దతిలో నియమించడానికి ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. ఆ అంశం అజెండాలో లేకపోవడంతో నియామకాలపై చక్రం తిప్పుతున్న ఒక సీనియర్ కౌన్సిలర్ సమావేశం వాయిదా వేయించారని తెలిసింది. 50 పోస్టుల భర్తీ విషయంలో ఆ సీనియర్ కౌన్సిలర్ అభ్యర్థుల నుండి రూ. రెండున్నర లక్షల వంతున వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాటాల పంపిణీలో తేడా కారణంగా అజెండాలో కార్మికుల నియామకాల గురించిన అంశం చేర్చలేదని, అందుకే సమావేశం వాయిదా వేశారన్న వదంతులు వినిపిస్తున్నాయి. అధికారులు వర్షం కారణంగా సమావేశం వాయిదా వేసినట్లు చెబుతున్నారు.

గొర్రెల కాపరులను ఆదుకోవాలి

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అధిక వర్షాల కారణంగా చల్లని గాలులకు తట్టుకోలేక వందలాది గొర్రెలు మృత్యువాత పడ్డాయని, నష్టపోయిన గొర్రెలకాపలాదారులకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని వృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి కారన్న ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన పత్తికొండలో విలేకరులతో మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు చల్లని గాలులకు తట్టుకోలేక జిల్లాలోని బిల్లేకల్లు, కోటకొండ, వలగొండ, కైరుప్పల, పుటకలమర్రి గ్రామాల్లో సుమారు 600 గొర్రెలు దాకా చనిపోవడం జరిగిందన్నారు. గొర్రెలను అమ్ముకుని జీవనం సాగిస్తున్న పెంపకందారులు గొర్రెల మృతితో అపార నష్టం సంభవించిందన్నారు. గొర్రెలను వృత్తిగా భావించి జీవిస్తున్న పెంపకందారులను ఆదుకునేందుకు ప్రతిగొర్రెకు రూ.20 వేలు చొప్పున నష్టపరిహారం అందించాలన్నారు. నాయకులు నరసింహులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి

● మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



కండువా కప్పి ఆహ్వానిస్తున్న రాఘవేంద్రరెడ్డి, రామకృష్ణారెడ్డి

మంత్రాలయం/కోసిగి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి కృషి చేస్తున్నామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం మాధవరంలోని తన నివాసంలో కోసిగి మండలం కామన్‌దొడ్డి గ్రామంలోని వైసీపీకి చెందిన వంద కుటుంబాలు ఆదివారం టీడీపీలో చేరాయి. వీరికి ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, మంచాల సింగిల్ విండో అధ్యక్షులు రామకృష్ణారెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు దొడ్డయ్య, నాగరాజు, వీరేష్, మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో కోసిగి మండల నాయకులు పల్లెపాడు ముత్తురెడ్డి, రామిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ నర్సిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రామకృష్ణ తాయన్న ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి



ఎమ్మిగనూరులో నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో గుర్రం జాషువా చిత్ర పటానికి నాయకులు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు గురురాజ్ దేశాయ్, జిల్లా కార్యదర్శి దయాసాగర్, బీఎల్ నారాయణ, రాజశేఖర్ స్వామి, వెంకటరమణ, శిల్పి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని వీవర్స్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ఉపాధ్యాయురాలు జ్యోత్స్న, ఫీరదౌసి, రామాంజనేయులు, వీరేశ్ పాల్గొన్నారు.

మంత్రాలయం: బూదూరులో బీఎస్‌ఎస్, మంత్రాలయంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో గుర్రం జాషువా 130వ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. బీఎస్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రామతీర్థం అమ్రేష్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు, బీఎస్‌ఎస్ నాయకులు రంగయ్య, ప్రభాకర్, భీమన్న, కరుణాకర్, ప్రేమ్ కుమార్, నరసప్ప, ప్రాణేష్, అనిల్, జేమ్స్, అంజి పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డులతో రేషన్ అక్రమాలకు చెక్



కార్డులను అందిస్తున్న తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి

కౌతాళం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు నూతనంగా క్యూఆర్ కార్డులతో రేషన్ స్మార్ట్ కార్డులను అందజేస్తోందని తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి, టీడీపీ నాయకుడు కాశీవిశ్వనాథ్ తెలిపారు. కౌతాళంతో పాటు మండలంలోని గ్రామాల్లో ఆదివారం ఆయా రేషన్ దుకాణాల వద్ద నూతన స్మార్ట్ కార్డులను పంపిణీ చేపట్టారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు ఉలిగయ్య, పట్టణ అధ్యక్షుడు రాజానందు, సొసైటీ చైర్మన్ వెంకటపతిరాజు, మెంబరు వీరేష్, మాజీ ఎంపీటీసీ సౌద్రి బసవరాజు, కార్యకర్తలు సిద్దు, రెహమాన్, గిరి, డీలర్లు జిన్నా వలి, రాజబాబు, మంజునాథ, పంపాపతి, అయ్యప్ప ఉన్నారు.

పెద్దకడబూరు: కూటమి ప్రభుత్వం అందజేస్తున్న స్మార్ట్ కార్డు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపి నాయకులు ఈరన్న, ముక్కన్న అన్నారు. హనుమాపురం, జాలవాడి గ్రామాల్లో శనివారం టీడీపీ నాయకులు స్మార్ట్ కార్డులను అందజేశారు. వీఆర్వో కృష్ణమూర్తి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని కడిమెట్ల టీడీపీ యువనాయకులు బోయ చంద్ర, రవిలు అన్నారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు మంజూరైన రేషన్ స్మార్ట్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వోల రామచంద్ర, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అనాథలను ఆదుకోవాలి

మంత్రాలయం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అనాథలను ఆదుకోవాలని సీఎస్‌ఐ డివిజనల్ చైర్మన్ వేదనాయకం, మాధవరం పాస్టర్ జాన్ వెస్లీ అన్నారు. ఆదివారం అనాథల కోసం సేవ చేసేందుకు సువార్త జయంతి వేడుకలను ఆదివారం మండలంలో ఘనంగా నిర్వహించుకున్నారు. భూపతి, జగదీష్, పాల్ రాజు, దావీదు, దేవ్‌పాల్, అరుణ్ పాల్గొన్నారు.

అక్షరాన్ని ఆయుధంగా మలుచుకున్నారు..!

● మంత్రాలయం నియోజకవర్గం నుంచి 127 మంది ఉపాధ్యాయులుగా ఎంపిక
● కోసిగి మండలం నుంచే 33 మంది
● ఇటీవల 16 మందికి పోలీసు ఉద్యోగాలు
● కరువు నేలపై సరస్వతీ పుత్రుల విజయ కేతనం



విజయ కేతనం చూపుతున్న నూతనంగా ఎంపికైన టీచర్లు

కోసిగి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలం అంటేనే అధికారులకు, నాయకులకు చిన్నచూపు. ఫ్యాక్షనిస్టు గ్రామం అని, మొరటోళ్ల ఊరు అని కోసిగిని అభివర్ణించేవారు. అక్షరాస్యతలో దేశంలోనే చిట్టచివరి నుంచి రెండో స్థానంలో కోసిగి మండలం కొనసాగుతూ వస్తోంది. అది ఒకప్పటి మాట.. ఇప్పుడు కాలం మారింది.. కోసిగి మండలం అంటేనే కర్నూలు జిల్లాతో పాటు రాష్ట్రంలో తలెత్తుకునేలా కోసిగిని చూసేలా మొన్న జరిగిన పోలీసు కొలువుల్లోనూ.. నేడు టీచర్ల నియామక పత్రాల్లోనూ కోసిగి తలెత్తుకునేలా చేసింది. ఇటీవల విడుదలైన కానిస్టేబుళ్ల ఫలితాల్లో మండలం నుంచి 16 మంది కానిస్టేబుల్లుగా ఎంపికయ్యారు. ఈనె 25న అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నుంచి నూతనంగా ఎంపికైన మండలం నుంచి 33 మంది యువ టీచర్లు నియామక పత్రాలు అందుకున్నారు. వీరితో పాటు మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి కొత్తగా ఎన్నికైన టీచర్లకు నియామక పత్రాలు అందజేశారు. మంత్రాలయం నియోజకవర్గం నుంచి కౌతాళం, కోసిగి, పెద్దకడుబూరు, మంత్రాలయం మండలాలకు చెందిన 127 మంది కొత్తగా ఉపాధ్యాయుల కొలువలకు ఎంపిక కావడంతో తల్లిదండ్రులు, నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అందులోనూ అత్యధికంగా కోసిగి మండలం నుంచి ఉపాధ్యాయ అర్హత అధిక సంఖ్యలో సాధించడంతో కోసిగికి మంచి పేరు తెచ్చిపెట్టారు. మా కళ కూటమి ప్రభుత్వం వల్లనే సాకారమైందని, గత ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో కొలువులు సాధించడం తమ కలలు సాకారమయ్యాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భార్యాభర్తలిద్దరం ఉద్యోగాలు సాధించాం



నేను, నా భార్య యశోద ఇద్దరం టీచర్లుగా ఎన్నికయ్యాం. కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ ఫలితాల్లో ఇద్దరం అర్హత సాధించాం. గత ఐదేళ్ల ప్రభుత్వం ఒక డీఎస్సీ నోటిఫికేషన్ భర్తీ చేయలేదు. మా కల నెరవేరింది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

\- శివకుమార్, ఆర్లబండ

ఎన్నో ఏళ్ల కల సాకారం



గత ప్రభుత్వం ఐదేళ్లలో ఒక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏడాదిలో నిర్వహించిన డీఎస్సీలో అర్హత సాధించి ఉపాధ్యాయుడిగా ఉగ్యోగం సాధించడం సంతోషంగా ఉంది. మా కాల సాకారమైంది. కూటమి ప్రభుత్వంలోనే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుంది. మా మండలం నుంచి అధిక సంఖ్యలో టీచర్లుగా ఎన్నిక కావడం హర్షణీయం.

\- పులిరాజు, కోసిగి

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



ఎమ్మిగనూరులో నివాళి అర్పిస్తున్న నాయకులు



పెద్దకడబూరులో..

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జయంతిని పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని భగత్ కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. డీవైఎఫ్ఐ పట్టణ నాయకుడు మోహన్, జిల్లా మాజీ అధ్యక్షుడు సురేశ్, అలాగే రాకేష్, ఉదయ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం: మంత్రాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. రాఘవేంద్ర సర్కిల్‌లో ఏఐవైఎఫ్ మండల సమితి టౌన్ అధ్యక్షులు మురళి, మంచాల సింగిల్ విండో సొసైటీ డైరెక్టర్ నగేశ్ నివాళి అర్పించారు. ఏఐవైఎఫ్ నాయకులు రాజు, విజయ్, ధనుష్, రాజు, సందీప్, అజయ్, ఆదిల్, రిషి పాల్గొన్నారు.

పెద్దకడబూరు: యువకుల్లో క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలని డీవైఎఫ్ఐ- ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్ నాయకులు రాజు, విల్సన్, దేవదాసు అన్నారు. ఆదివారం పెద్దకడబూరులోని భగత్ సింగ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ- ఎస్ఎఫ్ఐ నాయకులు ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు.

కార్యకర్తలకు అండగా 'డిజిటల్ బుక్': వైసీపీ



ఎమ్మిగనూరులో 'డిజిటల్ బుక్' యాప్ పోస్టరును విడుదల చేస్తున్న వైసీపీ ఇన్‌చార్జి బుట్టా రేణుక, నాయకులు



పోస్టరును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలకు అండగా 'డిజిటల్ బుక్' యాప్ ఉంటుందని వైసీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బుట్టా రేణుక అన్నారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో బుట్టా రేణుక, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ నాయకులపై, కార్యకర్తలపై దాడులు, అక్రమ కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రెడ్ బుక్‌కు దీటుగా డిజిటల్ బుక్ పని చేస్తుందన్నారు. డిజిటల్ బుక్ ద్వారా వైఎస్ జగన్ కార్యకర్తలకు అండగా ఉంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వైసీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు, దాడులు జరిగితే వాటి ఫొటోలు, దాడి జరిగిన సంఘటనలు డిజిటల్ బుక్‌లో అప్‌లోడ్ చేసి లోకేషన్ షేర్ చేయాలని సూచించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో కలిసి డిజిటల్ బుక్ యాప్ పోస్టరును విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు బుట్టా శివనీలకంఠ, కేఆర్ మురారి రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగేశప్ప, కోటకొండ నరసింహులు, నజీర్, లతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం: వైసీపీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండండి.. మీకు అండగా మేముంటామని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తన నివాసంలో 'డిజిటల్ బుక్ యాప్' పోస్టర్లను వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు కక్షసాధింపు చర్యలు చేపట్టినా వైసీపీ కార్యకర్తలు వెనుకడుగు వేయలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఈరన్న, బాలకృష్ణ, రాజేశ్ పాల్గొన్నారు.

ఆగని వాన

● పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
● పలు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు



మాలపల్లి వద్ద చేయి చేయి పట్టుకుని వాగు దాటుతున్న ప్రజలు



కోసిగి చాప వంక వద్ద నీటిని దాటుతున్న గ్రామస్థులు

మంత్రాలయం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురిసిన భారీ వర్షానికి వంకలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. ఆదివారం కురిసిన వర్షానికి మాధవరం, వగరూరు, మాలపల్లి వాగులు ఉప్పొంగాయి. మంత్రాలయం నల్లవాగు, మాలపల్లి వాగు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ఒక ఎద్దుల బండితో పాటు ఒక మోటారు సైకిల్ వాగులో కొట్టుకుపోయాయి. పోలీసులు అప్రమత్తమై అక్కడ రాకపోకలు నిలిపివేశారు. పొలాల్లో నీరు నిల్వ ఉండటంతో పత్తి, ఉల్లి, సజ్జ, కొర్ర, మిరప పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోసిగి: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కోసిగిలోని ఉరుకుంద రోడ్డులో ఉన్న చాప వంక ఉధృతంగా ప్రవహిస్తుంది. అయితే ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదకరస్థాయిలో చాపవంకకు వరద నీరు పోటెత్తడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దుద్ది గ్రామానికి చెందిన ఓ గర్భిణి పురిటినొప్పులతో బాధపడుతుండగా.. కుటుంబ సభ్యులు ట్రాక్టరులో వర్షంలోనే తడుస్తూ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే కోసిగిలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తే ఇలాంటి పరిస్థితి రాదని మండల ప్రజలు కోరుతున్నారు. చాపవంక ప్రమాదకరస్థాయిలో పోటెత్తడంతో రాత్రివేళలో వాహనదారులు చీకట్లో తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో కోసిగి మేజర్ గ్రామ సర్పంచ్ కుమారి అయ్యమ్మ, ఈవో చంద్రశేఖర్, ఇన్‌చార్జి ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి చాపవంకకు ఇరువైపులా ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయించారు.

'పార్టీకి పూర్వవైభవం తెద్దాం'

నందవరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పార్టీలో ప్రతి ఒక్కరు కలసి ఉండి పార్టీకి పూర్వవైభవం తీసుకువద్దామని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మాచాపురంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ వైసీపీ కోసం పని చేసిన కార్యకర్తలకు న్యాయం జరుగుతుందన్నారు. పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కారక్రమంలో రాష్ట్ర నాయకులు గడ్డం నారాయణరెడ్డి, సర్పంచ్ కోటేశ్వరరావు, చాంద్ పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి హారతి ఇస్తున్న భక్తులు

నందవరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమలగూడూరు గ్రామంలో అమ్మవారి ఆలయాల్లో ఆదివారం శాకంబరీగా దర్శనమిచ్చారు. ఉదయం నుంచే అర్చకులు శ్రీధర్‌స్వామి పంచాభిషేకం, ఆకుపూజ, జలాభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, మహ మంగళ హారతి లాంటి ప్రత్యేక పూజలు చేశారు. వెంకట్రామిరెడ్డి, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి'

గోనెగండ్ల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంట దెబ్బతిన్న గంజహళ్లి, ఐరన్‌బండ, ఎన్నెకండ్ల గ్రామాల రైతులకు ప్రభుత్వం పరిహారం వెంటనే ఇవ్వాలని మాజీ ఎంపీ, ఎమ్మిగనూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బుట్టారేణుక డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని పంట నష్టపోయిన గ్రామాలలో ఆమె పర్యటించారు. నీటి మునిగిన పంటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పంట నష్టపోయిన గంజహళ్లి గ్రామ రైతులకు అలాగే గాజులదిన్నె బ్యాక్ వాటర్ కారణంగా పంటలు నీట మునిగిన ఐరన్‌బండ, ఎన్నెకండ్ల, గ్రామాల రైతులకు పరిహారం ఇవ్వాలన్నారు. అలాగే సర్వేలు జరిపి ప్రైతుకు ఎంత నష్టం జరిగిందో అంచనావేసి ప్రభుత్వం పరిహారం ప్రకటించాలన్నారు. ఉల్లిరైతులు పరస్థితి చాలా ఘోరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నాయకుడు నీలకంఠ, మాజీ ఎంపీపీ, వైసీపీ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, వైసీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి ప్రమోద్‌కుమార్ రెడ్డి, కాశీవిశ్వనాథ్‌రెడ్డి, జిల్లా యువజన విభాగం కార్యదర్శి ఇమ్రాన్, గంజహళ్లి నాయకుడు రాముడు, ఐరన్‌బండ సర్పంచ్ నరసన్న, ఉపేంద్ర పాల్గొన్నారు.

పైపులైన్‌ను శుభ్రం చేయించాలి



ఎంపీడీవోకు సమస్యలు విన్నవించుకుంటున్న ప్రజలు

గోనెగండ్ల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వరద నీరు గ్రామంలోని కొళాయి పైపులోకి వెళ్లాయని, వాటిని శుభ్రం చేయించాలని గంజహళ్లి గ్రామపెద్దలు రంగారెడ్డి, రాముడు, మరి కొంత మంది గ్రామమస్థులు ఎంపీడీవో మణిమంజరిని కోరారు. పైప్‌లైన్ లీకేజి ఉన్న చోటను చూపించారు. అందులో వరద నీరు వెళ్లి తాగునీరు కలుషితం అవుతుందన్నారు. పైపులైన్‌ను పరిశీలించిన ఎంపీడీవో తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వర్షం వస్తే అవస్థలే

● తిరుమల నగర్‌లో నీటి కుంటలను తలపిస్తున్న రోడ్లు
● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



నీటి కుంటను తలపిస్తున్న తిరుమల నగర్‌లోని రోడ్డు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వర్షం వచ్చిందంటే తిరుమల నగర్ వాసులకు తిప్పలే.. తిప్పలు.. వర్షాలు కురిసినప్పుడు ఇళ్లముందు మడుగులా నీరు నిలిచి పోతుండటంతో ఇళ్లనుంచి ప్రధాన రోడ్డు ఎక్కాలంటే నానా అవస్థలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. తిరుమల నగర్‌లో రహదారులు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు.. ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పట్టణంలోని పలు కూడళ్లను అభివృద్ధి చేసేందుకు రూ. కోట్లు వెచ్చిస్తున్న అధికారులు ఆ పక్కనే రోడ్లు, డ్రైనేజీలు లేక వర్షాలకు ఇబ్బందులు పడుతున్న కాలనీవాసుల వైపు కన్నెత్తి చూడకపోవటం పట్ల విమర్శలకు తావిస్తోంది. ఎడతెరిపి లేకుండా వర్షం కురువటంతో తిరుమల నగర్‌లో మట్టి రహదారుల్లోనూ, ఇళ్లచుట్టు నీరు నిలిచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. కాలనీలోకి వెళ్లే రహదారుల్లో మడుగులా నీరు నిలిచి పోవటంతో ఇళ్లనుంచి బయటకు వస్తే.. ఇంట్లోకి వెళ్లలేని పరస్థితి.. ఇంట్లో ఉంటే బయటకు వెళ్లలేని దుస్థితి. కాలనీలో ఉన్న ఏ రహదారి సక్రమంగా లేకపోవటం గుంతలు పడటంతో వర్షం నీరు నిలిచిపోతున్నాయి. అంతేగాక వర్షం నీరు వెళ్లేందుకు మురుగు కాలువలు లేకపోవటంతో కాలనీలోనే ఖాళీస్థలాల్లోను, ఇళ్లచుట్టు నిలిచిపోతుండటంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురువటంతో నిలిచిన నీరు బయటకు వెళేందుకు ఎన్నిరోజులు పడుతుందో అర్థం కాక కాలనీ వాసులు ఆందోళనకు గురవుతున్నారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు వేయాలని స్థానికులు పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. అయినా ప్రయోజనం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. 27వ వార్డులో ఉన్న ఈ కాలనీకి మున్సిపల్ చైర్మన్ రఘు ప్రాతినిత్యం వహిస్తుండటం విశేషం. కాలనీలో ఒక సీసీ రోడ్డు మినహా మరే రోడ్లు, డ్రైనేజీలు కనిపించటం లేదు. రహదారుల్లో గుంతలు పూడ్చుకునేందుకు కాలనీ వాసులు సొంత డబ్బును వెచ్చించి గురుసును తెప్పించుకున్నారు. అయినా అధికారులు స్పందించిన దాఖలాలు లేవు.

పట్టించుకోవడం లేదు



మా కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు లేకపోవటంతో వర్షం వచ్చినప్పుడల్లా ఇళ్లనుంచి బయటకు వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టు తిరిగినా పట్టించుకోవడం లేదు. ఇంకా ఇలా ఎన్నిరోజులు ఇబ్బందులు పడాలో అర్థం కావటం లేదు.

\- ఆంజనేయులు, టీచర్

ఇబ్బందులు పడుతున్నాం



తిరుమల నగర్‌లో రోడ్లు, డ్రైనేజీలు లేకపోవటంతో రోడ్లపైనా, ఇళ్లముందు వర్షం నీరు నిలుస్తున్నాయి. దీంతో ఇళ్లనుంచి బయ టకు రాలేకపోతున్నాం. ఇక రాత్రి వేళల్లో అయితే నానా అవస్థలు పడాల్సిన పరస్థితి. ఒక్కోసారి కాలనీ వాసులు మోటారు బైక్‌లపై వెళ్తు స్లిప్‌అయి గుంతలో పడిన సందర్భాలు ఉన్నాయి.

\- బాలరాజు, ఉద్యోగి

రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలి



తిరుమల నగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేవు. ఎవరికి చెప్పిన పట్టించుకోరు. రోడ్లు, డ్రైనేజీలు లేకపోవటంలో ఇళ్లముందే వర్షం నీరు నిలిచి పోతున్నాయి. దీంతో కాలనీలోకి రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నాం. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే మా కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలి.

\- పవిత్ర, కాలనీవాసి